


# లోయ

ఉరుమురిమినట్లు శబ్దాలతో తమవైపే వస్తున్న వింత ఆకారంకేసి లోయవాసులు క్షణకాలం నిశ్చేష్టులై నిలబడి చూశారు.

వింత శబ్దాలకు భయపడ్డ పిల్లలు తేరుకొని ఆసక్తిగా చూస్తున్నారు. పెద్దలను, పిల్లలను కలవరానికి గురిచేసిన ఆ వింత ఆకారం ఏమిటో అని బండరాయి మాటున నడుం వాల్చిన కొండలాంటి మనిషి కాసింత ముందుకొచ్చి తేరిపార చూశాడు.

**ఎం. వెంకట్‌రాములు**

కథ

చూస్తుండగానే అది తామున్న బండరాయి సమీపంలోనే దిగింది. ఆ ఆకారం నేలపై దిగిన కుదుపుకు, ఆ గిర్రలు, రెక్కల వేగానికి రేగిన గాలికి అక్కడున్న ఆకులు, అలాలు లేచి కాకులు, గద్దల్లా పైకెగసి లోయంతా కమ్మేసాయి. ప్రశాంతంగా ఉన్న లోయంతా ఒక్కసారి కంపించిపోయింది. పిల్లలయితే ఊపిరి సలపక దూరంగా పరిగెత్తుకెళ్ళి ఏమవుతుందోనని ఆసక్తిగా దూరం నుంచే చూస్తున్నారు. రేగిన గాలి మెల్లగా తగ్గింది. దాంతోపాటు ఎగిరిన ఆకులు, అలాలు, దుమ్ము ధూళి క్రమేణ నేలవాలుతున్నాయి. క్షణకాలం చేష్టలుడిగిన జనాలు యధావిధిగా తమతమ పనుల్లో నిమగ్నమయ్యారు. పిల్లల ముఖాల్లో భయం స్థానంలో ఆసక్తి చోటు చేసుకుంది. వారు ఆ ఆకారానికి దగ్గరగా వచ్చి చూస్తున్నారు. ఆ ఆకారం తలుపులు తెరచుకున్నాయి.

ఏం జరగనుందోనని అందరూ ఓ కంట ఆసక్తిగా గమనిస్తూనే ఉన్నారు. ఆ ఆకారం తలుపులు తెరుచుకోగానే అందులో నుండి ఓ మరుగుజ్జులాంటి మనిషి బయటకొచ్చాడు. కళ్ళు, ముక్కు, కాళ్ళు, చేతులు అన్నీ అచ్చం తమలాగే ఉన్నాడు. మనిషి మాత్రం మరుగుజ్జులా మరీ పొట్టిగా ఉన్నాడు. అదోలా అడుగులో అడుగేస్తూ బండరాయి పైకెక్కి 'హలో అనాగరికం' అంటూ కేకవేశాడు. ఆ కేక ఆ లోయలో కొత్తగా వినిపించింది. ఆ కేక ధ్వని కొంచెమే అయినా అది పుట్టించిన మాట వారికి కొత్తగా ఉంది. ఆపసోపాలు పడుతూ బండరాయిని ఎక్కి వస్తున్న మరుగుజ్జు మనిషినే చూస్తున్న కొండలాంటి మనిషి కాసింత దగ్గరగా వచ్చాడు. ఏడడుగులకు ఇంచు తక్కువకాని ఎత్తు, కండలు తిరిగిన శరీరం, అక్కడక్కడ నెరసిన వెంట్రుకలు అతడి వృద్ధాప్యాన్ని తెలుపుతాయి కానీ అతడి కళ్ళలోని కాంతి, శరీర పటుత్వం అతడి వయస్సును తెలియనివ్వవు. సమీపానికొచ్చి పలకరించిన మరుగుజ్జు మనిషిని తీక్షణంగా చూస్తూ "ఏంటి ఆ పిలుపు అది నా పేరు కాదే" అన్నాడు. దానికి మరుగుజ్జు మనిషి "నీకు కొత్తగా ఉందేమోగాని నాకు పాతదే. నేను నాగరికాన్ని, నువ్వు అనాగరికానివి" అంటూ వేలెత్తి చూపిస్తూ అన్నాడు.

"నీకు జ్ఞాపకం ఉందా! లోయలో బతుకువెళ్ళదీస్తున్న నువ్వు, లోయకు బయట మైదానంలో, మహానగరాల్లో జీవిస్తున్న నేను ఒక తల్లి పిల్లలమే. లోయ నుండి బయటపడ్డ నేను అనంతమైన విజ్ఞానాన్ని ఆర్జించాను. చరిత్రను రాసిపోశాను. సరికొత్త నాగరికతను ఆవిష్కరించాను. అధునాతనమైన మేడలు కట్టి, అత్యాధునికమైన యంత్రాలను కనిపెట్టాను. సముద్రాలు ఈదాను. చంద్రలోకాన్ని తాకాను. భూలోకం నుండి గ్రహాంతరాలకు నిచ్చెనలు వేస్తున్నాను. ఒకప్పటి పల్లెలను దిగమింగి పట్టణాలను నెలకొల్పాను. స్వర్గాన్ని మరిపించే మహా నగరాలను నిర్మించాను" అంటూ నాగరికం చెప్పుకుంటూ పోతున్నాడు.

అనాగరికం అలా వింటూ ఉంటే ఎప్పుడో లోయలో ఓ చెట్టు కింద అమ్మ పురుడు పోసుకొని పండంటి కవల పిల్లలను కన్నదని, సొమ్మసిల్లి పడి ఉన్న తల్లి పక్కన పడి ఉన్న ఇద్దరి బిడ్డలలో ఒకడిని పెద్ద డేగ ఎత్తుకెళ్ళిందని, ఆ డేగ ఎగురుతూ లోయ దాటి వెళ్ళిందని, అలా లోయ దాటి వెళ్ళిన బిడ్డను డేగ పొడిచి తిని ఉంటుందని కొందరు, గద్దపై లోయ ఎగువభాగాన ఎక్కడో విడిచి పెట్టి ఉంటుందని కొందరు కథలుగా చెప్పుకుంటుంటే తాను విన్నాడు. బహుశా ఆ బిడ్డేనేమో ఈ నాగరికం అనుకుంటుండగా, నాగరికం తన గొప్పలను ఏకరువు పెడుతూనే వున్నాడు.

"అంత గొప్ప నాగరిక నిర్మాణంలో ఇంత మరుగుజ్జుగా ఎలా అయ్యావు" అన్న అనాగరికం ప్రశ్నకు నాగరికం కొంత ఇబ్బందిపడ్డాడు. "కృత్రిమ యంత్రాల పనివిధానంలో పడి మనిషిని మరుగుజ్జులా అయ్యాను కాని, మేధాపరంగా నేను చాలా ఎత్తుకు ఎదిగాను" అంటూ సమర్థించుకున్నాడు. మాటకలుపుతూ, అలా కాళ్ళు కూడా కదిపారు. లోయ తీరాలు చూస్తూ అలా బయలుదేరిన వాళ్ళను అక్కడి జనాలు అనాగరికం పక్కన మరు గుజ్జులాంటి నాగరికాన్ని వింతగా చూస్తున్నప్పటికి ఎవరి పనుల్లో వాళ్ళుండిపోయారు.

"లోయలో ఎవరికి చేతనైన పని వాళ్ళు చేసుకుంటారు. ఎవరికి ఎవరి మీద అజమాయిషీ వుండదు. పగలు, ద్వేషాలు, ఈర్ష్య వంటివి వుండవా?" అంటూ అడ్డు వచ్చిన నాగరికం సందేహాన్ని పక్కకు నెట్టి చెప్పుకుపోతున్నాడు అనాగరికం. "ఈర్ష్యాద్వేషాలకు ఇక్కడ తావుండదు. లోయలో ఎన్నడు ఆహారానికి కొరత లేదు. వేట, వ్యవసాయం, చేపలు పట్టడం ప్రధాన వృత్తులు. అవి కూడా లోయ జనాల ఆహారం కోసమేగాని ఇతరత్రా కాదు."

"ఇక్కడ పండ్లు, చేపలు ఎక్కువ కదా! వీటితో వ్యాపారం చేయవచ్చు. జంతువుల మాంసం, చర్మాలతో కూడా ఎంతో వ్యాపారం చేయవచ్చు" అంటూ తన వ్యాపార బుద్ధిని బయటపెట్టాడు నాగరికం.

కళ్ళ ముందర ఇబ్బడి ముబ్బడిగా తిరుగుతున్న జంతు సమూహాలు, కళ్ళు చెదిరే కలవ, చెట్ల నిండా కాయలు, కుప్పలుగా రాలిపడిన పండ్లు, సువాసనలు వెదజల్లే పూలు అన్నింటిని మించి గలగలపారుతున్న సెలయేళ్ళు, ఇవన్నీ చూస్తుంటే కళ్ళు తిరిగినంత పనయ్యింది నాగరికానికి. అనాగరికం చెప్పుకుంటూపోతున్నాడు. "వ్యాపారం ఎందుకు? లోయలోఎవరికి ఏ కొరత ఉండదు. రేపటి చింత అసలే ఉండదు. ఆహారధాన్యాలు, కూరగాయలు పండించటమే మా వ్యవసాయమంతా.మిగతా పండ్లు,చేపలు, మాంసం సమృద్ధిగా దొరుకుతాయి." "కొరత అనేది మొదట్లో ఉండదు. అది మనం సృష్టించాలి అనాగరికం. అలా లేని కొరతలు కల్పిస్తేనే వ్యాపారం అభివృద్ధి అయ్యేది" అంటూ తన వ్యాపార కీలకాన్ని బయటపెట్టిన

నాగరికాన్ని పట్టించుకోకుండా చెప్పుకుపోతున్నాడు అనాగరికం. "లోయలో మనిషి పనిచేయాలనుకున్నప్పుడు చేస్తాడు, విశ్రాంతి అవసరమనుకుంటే విశ్రాంతి తీసుకుంటాడు. రోజులో ప్రతి మనిషి ఏదో సమయంలో పని చేస్తాడు. అది వేట కావచ్చు, వ్యవసాయం కావచ్చు, పండ్లు ఏరటం కావచ్చు. ఇందులో కూడా ఎవరి బలవంతమూ ఉండదు. ఎవరి ఇష్టం వారిది" అంటూ చెప్పుకుంటూ చాలా దూరమే నడిచారు.

గలగల పారుతున్న సెలయేరు సవ్వడులు, పక్కనే పరిచినట్లున్న పచ్చగడ్డి చుట్టూ ఎత్తైన చెట్లు. చూస్తేనే అక్కడ కాసేపు విశ్రమిద్దామా! అనిపిస్తుంది. అక్కడే ఓ చెట్టు కింద విందు ఏర్పాటు చేశాడు అనాగరికం. అందులో రకరకాల పళ్ళు, చేపల పులుసు, మాంసం వంటి పదార్థాలతో సంతృప్తిగా విందారగించారు. స్వచ్ఛమైన నీళ్ళు తాగారు. మళ్ళీ ముందుకు కదిలారు. ప్రకృతి శోభను పరికిస్తూ నడుస్తున్న నాగరికానికి పరిపరి విధాల ఆలోచనలు వస్తూనే వున్నాయి. కళ్ళముందు కదలాడుతున్న ప్రకృతి సంపద రకరకాలుగా చిత్రితమవుతున్నది నాగరికానికి. కోట్లు గుమ్మరించినా దొరకని ఈ స్వచ్ఛమైన గాలి, వాతావరణం, నీరు, ఆహారం చూస్తుంటే తనకు దక్కని వేవో ఇక్కడ పోగుపడినాయా అనిపించింది నాగరికానికి. ఈ లోయను హస్తగతం చేసుకుంటే ఈ ప్రపంచాన్ని శాసించే సంపదను పోగుచేసుకోవచ్చుననిపించింది కూడా అతనికి. అనిపించిందే తడవుగా మనసు మనసులో లేకుండాపోతోంది. అనాగరికం చెబుతున్నది యాంత్రికంగా వింటున్నాడు గాని తన లోలోపల వ్యాపారపు ఆలోచనలు పురి విప్పుకుంటున్నాయి.

"చూశావా అనాగరికం! నీ లోయలో ఎక్కడైనా ఈ రోడ్లు, ఈ భవనాలు, ఈ ఫ్లై ఓవర్లు, సినిమాహాళ్ళు, ఫిలిమ్‌సిటీలు, పార్కులు వున్నాయా? చూడు బాగా చూడు. ఇక్కడ ప్రజలకు డబ్బుంటే ఏదైనా ఇట్టే కొనెయ్యి వచ్చు. డబ్బుంటే చాలు ఆ కనబడే చందమామను కిందికి దింపమంటే దింపుతారు మా వాళ్ళు."

లోయంతా తిరిగి తిరిగి తన వాహనం దగ్గరకొచ్చారు. వాహనంలో తీసుకొచ్చిన కొన్ని మైదానపు వస్తువులు, ఆటబొమ్మలు, కృత్రిమ మిఠాయిలు తీసి అక్కడి పిల్లలకిచ్చాడు. అంతవరకు దూరంగా ఉన్న పిల్లలు తమ మనిషి వెంట కలిసి తిరిగినందుకు కాబోలు మరింత దగ్గరకు వచ్చారు. నాగరికం ఇచ్చిన మిఠాయిలు తిన్నారు. బొమ్మలు తీసుకున్నారు. "అనాగరికం నువ్వు నా వెంట రావాలి. నా ప్రపంచాన్ని చూడాలి. నీ లోయలో నడిచినట్లు నడక ఉండదు. నా వాహనం నుండే అన్నీ చూపిస్తాను. ప్లీజ్ రావాలి, రావా?" అంటూ వంకర్లు పోయాడు నాగరికం. అతడి పితలాటం చూస్తుంటే ఎందుకో వెళ్ళాలనిపించింది అనాగరికానికి. లోయలో



తనవాళ్ళు వద్దంటున్నా పొద్దుగుంకె వేళకి మళ్ళీ వస్తానని చెప్పి వాహనం ఎక్కాడు అనాగరికం. నాగరికం బటన్లు నొక్కగానే వాటంతటవే తలుపులు మూసుకున్నాయి. వాహనం పైకి లేచింది. తాము పైపైకి వస్తున్నకొద్దీ లోయ లోలోపలికి పోయినట్లనిపించి, 'లోయకు దూరమైపోతానా' అనిపించింది అనాగరికానికి. వాహనం వేగం అందుకున్నది. లోయదాటి మైదానంలోకి వచ్చింది. పల్లెల నుండి పట్టణాలను దాటుతూ నగరాల వైపు వెళ్తోంది వాహనం.

"చూస్తున్నావా అనాగరికం లోయ బయటి ప్రపంచం" అంటూ చెప్పబోయాడు నాగరికం.

"చూస్తున్నాను ఏమిటి ఎక్కడ చూసినా కాసిన్ని నీళ్ళు కూడా కనబడవు. పచ్చదనం లేదు. మీలాగే మీ చెట్లు కూడా మరుగుజ్జుల్లా ఉన్నాయి. ఇవి చూస్తుంటే ఎందుకో నీ ప్రపంచం అంతా నాకు తలకిందులుగా కనబడుతోంది. ఆ పొడగాటివేమో కట్టడాలు, భవంతులు అంటున్నావు. భూమిలో నుండి వెదురుమొక్కలు ఏపుగా పెరిగినట్లు ఆ కట్టడాలన్నీ కిక్కిరిసి ఉన్నాయి. గాలి వీస్తుందని తెలియడానికైనా ఓ చెట్టులేదు! ఏమిటీ విడ్డూరం" అంటూ ముక్కున వేలేసుకున్నాడు అనాగరికం.

వాహనాన్ని మరింత మెల్లిగా పోనిస్తూ అన్నాడు నాగరికం. "చూడు అనాగరికం. నా గొప్పంతా చూడడానికి ఈ మహానగరం ఒక్కటి చాలు. నీ జీవితంలో ఇలాంటివి చూడలేవు" అన్నాడు.

"కాలు కింద పెట్టి నడవరు మా మహానగరాల్లో అన్నావు. పశువులను బంతికట్టి కల్లంలో తిప్పినట్లు జతలుజతలుగా అలా చెమటలు గక్కుతూ తిరుగుతున్నా రెందుకు?" అన్నాడు అనాగరికం.

"ఓ అదా! వాళ్ళు ఒళ్ళు కొవ్వెక్కి తిరుగుతున్నారు" అని చెప్పిన నాగరికం సమాధానానికి అదోలా చూశాడు అనాగరికం.

"నిజమే. నేను వాస్తవమే మాట్లాడుతున్నాను. రోజంతా వాళ్ళు కాలు కింద పెట్టరు. ప్రపంచ సంపదనంతా ఒక్క దగ్గర పోగుచేయాలన్న తపన వారిది. అందుకు చెమట చుక్క చిందకుండా ఏసి రూముల్లో కూర్చుని ఆలోచిస్తారు. అలా కొవ్వెక్కుతారు. అలాంటివారికి రక్తపోటు, గుండెపోటు లాంటి అనేక రోగాలు వస్తున్నాయి. అయినా వాటన్నింటిని సమర్థంగా ఎదుర్కొనే వైద్యం వాళ్ళకు అందుబాటులో వుంటుంది. అయినా వాటిని కాసింత అదుపులో పెట్టుకోవటానికి వారలా మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్‌ల పేర అలా నడుస్తుంటారు. వారి నిర్వచనంలో శారీరక శ్రమ అంటే అలాంటి వాకింగే" అన్నాడు నాగరికం.

"ఇదంతా దేనికి చక్కగా పొలాల్లో పనిచేస్తే ఇవన్నీ ఉండవుగా. ఇందాక నువ్వు చెప్పిన పోటులేమోగాని, మాకు తెలిసిందల్లా రోకటిపోటు, సమ్మెట పోటులే." అనాగరికానికెందుకోగాని ఆ మనుషులంతా తమ ఇళ్ళలోని ముంతలకు, బిందెలకు కాళ్ళు, చేతులు అతికించినట్లు కనబడ్డారు.

"చూశావా అనాగరికం! నీ లోయలో ఎక్కడైనా ఈ రోడ్లు, ఈ భవనాలు, ఈ ఫ్లైఓవర్లు, సినిమాహాళ్ళు, ఫిలిమ్‌సిటీలు, పార్కులు వున్నాయా? చూడు బాగా చూడు. ఇక్కడ ప్రజలకు డబ్బుంటే ఏదైనా ఇట్టే కొనెయ్యవచ్చు. డబ్బుంటే చాలు ఆ కనబడే చందమామను కిందికి దింపమంటే దింపుతారు మావాళ్ళు"అని తన గొప్పదనాన్ని సగర్వంగా చెప్పుకుపోతున్నాడు నాగరికం.

"ఎందుకు దింపాలి? దింపి ఏం చేసుకోవాలి?" అన్న అనాగరికం మాటతో కాస్త కంగు తిన్నాడు నాగరికం. "నీ లోయలో నడవడానికి కాళ్ళు, పనిచేయడానికి చేతులు నమ్ముకున్నారు మీరు. ఇక్కడ చూడు ఒక్క మనిషి కోసం ఎన్నో యంత్రాలు పని చేస్తాయి. బెడ్డు మీది నుండి కాలు కదలకుండా అన్నీ యంత్రాలే అందిస్తాయి. మెదడు తప్ప మాకు ఇతర అవయవాలతో పనిలేకుండా పోయింది. మా ఆలోచనల నుండి పుట్టిన యంత్రాలు ఎంత అసాధ్యమైన పనులనైనా చిటికెలో సుసాధ్యం చేస్తాయి. నీ వడిగావే పాముల్లా, పురుగుల్లా పాకుతూ పరిగెడుతున్నవేంటని? అవన్నీ మావాళ్ళు తయారుచేసుకున్న వాహనాలే. రోడ్ల మీద మనుషులు తక్కువ, వాహనాలు ఎక్కువ కనబడుతున్నాయి కదూ!" అని చెబుతుండగానే ఓ వాహనం రోడ్డు మీద వెళ్తూ మనిషిని

త్నాన్ని విరమించే ఆలోచనలో లేదు నాగరికం.

ఇదంతా విన్న అనాగరికం "ఒకే ఒక్క ప్రశ్న నాగరికం! లోయలో వున్న సంపదంతా మైదానంలోకి తెస్తాం. మీరన్నట్లే దాన్ని వ్యాపారంలో పెడతాం. మీరు చూస్తున్న డబ్బు రూపంలో అది ఒకటికి వంద రెట్లు అవుతుందనుకుందాం. అప్పుడేం చేయాలి?" అని ప్రశ్నించాడు.

"సంపద ఒకటికి వందరెట్లు అయినప్పుడు మనిషి కాలుపై కాలు వేసుకొని తరతరాలు హాయిగా బతకవచ్చుగదా!" అన్నాడు నాగరికం.

"మరి మేం లోయలో అలాగే బతుకుతున్నాం కదా? మరి ఇంత యాగి ఎందుకు చేయాలి. ప్రకృతినంతా ఇంత బీభత్సంగా చేయాల్సిన అవసరం ఏమిటి?" అంటూ ప్రశ్నించిన అనాగరికంతో వెటకారంగా "నీవెంత మాత్రం మారవు అనాగరికం. అలా మారేవాడివైతే నువ్వు నాగ రికం అవుతావుగాని అనాగరికానివి ఎందుకు అవుతావు? నిన్ను మార్చా లనుకోవడం నాదే బుద్ధి తక్కువ. నిన్ను లోయలో వదిలేస్తాను" అంటూ వాహనం వైపు నడిచాడు.

ఇద్దరు వాహనంలో బయలుదేరారు. మళ్ళీ అవే భవనాలు, అవే రోడ్లు. మరింత మరుగుజ్జులుగా మారిన మనుషులు. మనుషులు, మను షుల్నే మోసగించుకుంటున్న సంఘటనలు. చావడాలు, చంపుకోవడాలు, ప్రమాదాలు, అభద్రత, ఆకలి, ఆత్మహత్యలు అబ్బోబ్బో ఎన్నెన్ని దృశ్యాలు. వాటి పక్కనే చక్కటి ఉద్యానవనాలు. అందమైన భవనాలు, సరస్సులు. అవి కొందరికే ఆహ్లాదానిచ్చి, ఎందరికో ఆందోళన కలిగిస్తున్న వైనం. అతితక్కువ సమయంలోనే అనుభవంలోకి వచ్చింది అనాగరికానికి. ఈపాటికే వాళ్ళ పరిభాషలోని ఏ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లోనో తన తలలోని మెదడు తీసేసి వాళ్ళ మెదడు వేయాలనే ఆలోచన రానందుకు సంతోషించాడు అనాగరికం. అలా ఆలోచిస్తుండగానే నగరాలు, పట్టణాలు, పల్లెలు దాటుతూ 'లోయ'లోకి ప్రవేశించింది వాహనం.

తలుపులు తీసి బయటకొచ్చిన అనాగరికానికి లోయలో ఏదో మార్పు వచ్చినట్లనిపించింది. అప్పటిలా జనాలు ఎవరి పనుల్లో వారుండక వాహనం దగ్గర గుమిగూడారు. పిల్లలు కొందరు రయ్యిమని వాహనం దగ్గరకు వచ్చి చప్పట్లు కొడుతున్నారు. మరికొందరు పిల్లలు నాగరికం ఇచ్చిన బొమ్మలతో ఆడుకుంటున్నారు. అంతకుముందులా పిల్లల చేతుల్లో విల్లంబులు లేవు. పడుచుల చేతుల్లో కొడవళ్ళు, గొడ్డళ్ళు లేవు. నాగరికం వదిలి పోయిన వస్తువుల మోజులోపడి పిల్లలు అలాంటివి మాకూ కావాలని మారాం చేయటం మొదలుపెట్టారట. తాను చూస్తుండగానే పిల్లల తల్లి దండ్రులు నాగరికాన్ని చుట్టుముట్టి తమ విలువైన సహజసంపదను వాహనంలో పెట్టి ఆటబొమ్మలను తెచ్చియ్యమని బతిమాలుతున్నారు.


ఈ పరిస్థితిని గమనించిన అనాగరికానికి ఏమీ పాలుపోవటంలేదు. నాగరికం మాత్రం లోలోన ముసిముసిగా నవ్వుతున్నాడు. వాళ్ళకేదో చెబుతున్నాడు. "ఇంకా పెద్ద వాహనంలో చాలారకాల వస్తువులు తెస్తానని, మీరు మీ పిల్లలు వాటితో హాయిగా ఆడుకోవచ్చని" చెబుతున్నాడు. తాను చేయలేని పని తను తెచ్చిన వస్తువులు చేసినందుకు ఎంతగానో సంబరపడిపోతూ వాహనం తలుపు వేసుకున్నాడు నాగరికం.

పోతూపోతూ విజయదరహాసంతో అనాగరికం వైపు చూస్తూ "వెళ్ళొస్తా అనాగరికం! లోయను మైదానంలోకి తీసుకెళ్దామనుకున్నా. కానీ లోయనే మైదానంగా మార్చవచ్చని నా వస్తు ప్రపంచం చెప్పింది" అంటూ వాహనాన్ని కదిలించాడు.

వాహనం పైపైకి పోతున్నాకొద్దీ 'లోయ' లోలోపలికి కుంగుతున్నదా! అనిపించింది అనాగరికానికి. ఏంచేయాలి? ఏంచేస్తే 'లోయ'ను సంరక్షించుకోగలను? అని పదేపదే ప్రశ్నించుకున్న అనాగరికానికి ఓ కొత్త తలంపు తట్టింది. ఇప్పటిదాకా లోయలో ఆ తలంపుకు ఆస్కారం లేదు. అవసరం అంతకన్నాలేదు. అది ఇప్పటికిప్పుడు వచ్చిన తలంపు. నాశనం చేయాలనే తలంపు. అవును నాశనం చెయ్యాలి. నాగరికం తెచ్చిన వస్తువులను నాశనం చెయ్యాలి. అప్పుడే ఆ వస్తువులను సమర్థించే వర్గం ఒకటి తయారైంది లోయలో. వారినీ మార్చుకోవాలి. లోయ సంస్కృతిని, వస్తు సంస్కృతిలోకి మార్చే వాహనాన్ని నాశనం చెయ్యాలి. అందుకు లోయనంతా సమాయత్తం చేయడానికి పూనుకున్నాడు అనాగరికం. •

# అంతర్లోచనం

నాతో
నావెంటే
నా ఒంటరితనంలో భాగంగా
రాత్రంతా intangibleగా కురిసి
పొద్దున్నే crystalise అయిన మంచులా
అంతలోనే రూపు మార్చి
ఊహలా ఎర్రగా ఆశలా కాలుతూ
అంటుకున్న అడవిలా
లావా మింగిన ఆరావళిలా
రూపు ఊహించలేని విధంగా
చెంగున ఎగిరి పొదల్లో దూరిన బంగారు లేళ్ళలా
నా అవిభాజ్య అంగంగా
నాళాల్లో రక్తంలా
అద్దంలో నా ముఖంలా
తెలిసి తెలుస్తూ
జారుకున్న బోనులో నా ఎదుట పులిలా
పులి... నేను... ఎదురెదురు
పులిలో నేను లో పులి
ఒకరినొకరు నములుతూ
అనుక్షణం చైతన్యం
కాలం ఆగిపోయినట్లు
మొగ్గ విచ్చుకుంటున్నట్లు
అదొక ఆవిష్కరణ
అలుపెరుగని నిరంతర ప్రాసెస్... ఎవల్యూషన్!
మస్తిష్కపు కెటిల్‌లో
మరిగే ఇరానీ చా డికాషన్‌లా
ఉబుకుతున్న Geyser లా
సృష్టిగా రూపుకట్టి
ఉద్యమంలా విస్తరించి
నాలో లేని నన్ను వెలికి తీస్తూ
నాకు తెలీని నా గుండె కోణాలను వీడియో కోస్తూ
పసినవ్వు మార్మికతలా నన్ను సవాల్ చేస్తూ
జీవితాన్ని obsession చేస్తూ
నా పాంచ భౌతికానికి
జ్ఞాపకమై వ్యాపకమై, రచనై పరిమళాలు అద్ది
నా ఉనికిని ముద్రిస్తూ
నన్ను మించి జీవిస్తుంది
గీతలోని ఆత్మలాగా
మరో ట్రైన్ కోసం నాలాంటి నా కోసం
ఎదురుచూసే ప్లాట్‌ఫారం అవుతుంది
మీడియం అవుతుంది
నిత్యం నిరంతరం
సంచలనం
లోతైన లోచనం
ఆలోచలనం
ఆలోచన
ఒక frequency...
Resonance లో ప్రపంచం!!



– వి.రామమనోహర్